# గండ పెండేరం

ఒకప్రక్క ఎర్రని యెండా, ఇంకో పక్క చల్లని వానా, ఒక్క హిమవత్పర్వతానికే చెల్లింది, అని కాళిదాసు అన్నట్టు—

ఒకవైపు ఆధునిక కవితా గోష్ఠులూ, వేరొకవైపు సంప్రదాయ సాహిత్య పూజా ఒక్క రాజమహేంద్రవరానికే చెల్లిందనుకుంటాను.

ఇసక వేస్తే రాలనంత సభ. ప్రాచీనులూ, నవీనులూ ఒరసి దరిసి కూర్చున్నారు.

రంగస్థలం గౌతమీ లైబ్రరీ ఆవరణం.

సభాధ్యక్షులు చెళ్ళపిళ్ళ వెంకట శాస్త్రిలుగారు "కాలికో, చేతికో తొడుగగావలె నియ్యది" అని చిరునవ్వుతో ఒక వస్తువు చేతితో పట్టుకు నిలుచున్నారు తళతళ మెరిసిపోతోంది! యేమిటది?

ఇప్పుడెక్కడా కనిపించవుగాని, పూర్వం 30, 40 ఏళ్ళ కిందట

అట్టి ఆభరణం ఆడవాళ్ళు రెండు పాదాలకు ధరించేవారు. దానిపేరు అందె. రెండు పాదాలకూ ధరిస్తే స్త్రీల ఆభరణమే. ఒక్క పాదానికి - ముఖ్యంగా ఎడమకాలికే-ధరిస్తే అది పౌరుష చిహ్నం. గొప్ప వీరుడికీ, గొప్ప కవికీ మాత్రమే అది అర్హం. అప్పుడు దాని పేరు గండపెండెరం!

పూర్వం విజయనగరంలో నారాయణ దాసుగారి కాలికి వుండగా చూశాను. మళ్ళా ఇప్పుడీ సభలో ప్రత్యక్షమయింది. చక్కని నగిషీ పనితో బంగారంతో చేశారు అక్కడి పనివారు.

"కవి సార్వభౌమ" శ్రీపాద కృష్ణమూర్తి శాస్త్రిగారిని ఆ గండ పెండెరంతో గౌరవించడానికి అభిమానులూ, సాహిత్య రసికులూ అక్కడ మహాసభ యేర్పాటు చేశారు.

చెళ్ళపిళ్ళవారు అధ్యక్షులు. కారణం ఆయన శ్రీపాదవారికి శిష్యులు కావడం ఒకటి. రెండోది దేశంలో వెంకటశాస్త్రిగారి పేరు బహూవ్యాప్తిలో వుండడం.

వెంకటశాస్త్రిగారు బహు చమత్కారి. లోకంలో "అందె వేసిన చేయి" అని వుండడంవల్ల ఈ అందె చేతికా? కాలికా? అని ఆయన సందేహం! కాని చేతికి కడియం, కాలికి అందె సుప్రసిద్ధం. చేతిదగ్గర వుండే "అందె" అన్న మాటకు కడియమనే గ్రహించాలి. ఈ సంగతి తెలియకా! వెంకటశాస్త్రిగారు చమత్కరించింది!

భువనవిజయ మహాసభలో రాయలు ఆంధ్ర కవితా పితామహుణ్ణి గండపెండెరంతో గౌరవించడం విననివారు లేరు. నాటికి నేడు గండ పెండెరం ప్రసక్తి తటస్థించింది. చట్టున పెద్దన్నతో కలిపి శ్రీపాదవారిని చూడడంలో కొన్ని ఇబ్బంది లున్నాయని దాని ధ్వని కావచ్చు.

"మను చరిత్ర"తో అచ్చపు ప్రబంధం అవతరించింది. అందుకే ఆయన ఆంధ్ర కవితా పితామహు డయాడు — మరి ఈయన?

ఈయన రచనలలో గొప్పది, "శ్రీకృష్ణ భారతం". అది ఈయన తోనే ప్రారంభం కాలేదు. త్రిమూర్తులువంటి కవిత్రయం ముందే అమోఘంగా చేసి వుంచారు. వారి తర్వాత సుమారు ఏడు వందల సంవత్సరాలకు మళ్ళా ఈయన తెనిగించారు. కనుక ఆ ఉపజ్ఞ ఇంకొకరిది.

అయితే—యెందుకీ గండపెండెరం?

అక్కడే ఆలోచించవలసింది వుంది.

వంద పద్యాలు, వట్టినే కాపీ చేస్తే చేతులు నొప్పెడతాయి. పది అధ్యాయాలు ఏకబిగిని చదివి అర్థం చేసుకోవాలంటే తలనొప్పి పుడుతుంది. అట్లాంటి సందర్భంలో-పాఠభేదాల షేచీలతో మతి పోగొట్టే భారతాన్ని— ఒక్క చేతిమీదుగా తెనిగించడం అంటే నల్లేరుపై బండి నడిపించడం కాదు. అట్టి మహోద్యమానికి తలపడి ఎన్నో కష్టాలకు లోనై శ్రీపాద వారు మళ్ళా భారతం ఒక్క చేతిమీద తెనిగించారు. అట్లా తెనిగించి నందుకు ఆయన గర్వపడలేదు. తన భారత పీఠికలో "వేయేండ్లు తల క్రిందుగఁ దపస్సు చేసినను నన్నయాదుల కవిత్వముతో నస్మదాదుల కవిత్వము కొంచెమైనను సరిపడబోదు. వారి కవిత్వముకడ నాయది పైత్యమే" అని వినయ వినమితులై చెప్పుకున్నారు.

ఈ భారతంమీద వీరేశలింగంగారి అభిప్రాయం చాలా మంది సందేహం తీర్చేదిగా వుంది. "రచనా నైపుణ్యమున కవిత్రయ భారతమునకు సరితూగకపోయినను యథా వ్యాస భారత మనుటకు తగియున్నది.

"కవిత్రయము తెనిగించని చోట భారత మెట్లున్నది?" అన్న ప్రశ్నకు ఇది జవాబు చెబుతుంది.

శ్రీనాథుడు గాఢ ప్రతిభ అని ఒక కొత్త మాట ఉపయోగించాడు, అదీ నన్నయగారి విషయంలో. కవిత్రయానిది గాఢ ప్రతిభ అయితే శ్రీపాదవారిది ప్రతిభ మాత్రమే కావచ్చు. కాని దాని విలువ దానికుంది. "చతుర కవిత్వ తత్వ పటు సంపద ఒక్కరి సొమ్ముగాదు."

కృష్ణ భారతం బాగా చదివినవారిలో భమిడిపాటి వారొకరు. ఆయన ఒక ప్రసక్తిలో అన్నారు,

"తొలి పర్వాలకంటె మలి పర్వాలలో శాస్త్రిగారి హస్త కౌశలం కనపడుతుంది. సందేహంలేదు" అని.

ఆ సభకు బెంగుళూరి నాగరత్నం వచ్చి ప్రసంగించడం ఆమె అరవయాసకు సభలో చిల్లర జనం "ఇస్, ఇస్" అని అల్లరిచేస్తే ఆమె వారిని దులపడం, ఈ "భారత" కథలో చిన్న ఉపాఖ్యానం!

వెంకట శాస్త్రిగారు ఏమి చమత్కరించినా చివరికి గురువుగారి పాదానికే గండపెండెరం తొడగడం, సభవారు హర్ష పులకితులై చూడడం జరిగింది. శ్రీపాదవారు జవాబు చెబుతూ — "ఈ గండపెండెరం ధరించ డానికి నేను తగకపోయినా - మీ అభిమానానికి భాషాదరానికి తలవంచి స్వీకరిస్తున్నాను. నా చేతులతోటే దీన్ని ఆంధ్ర విశ్వవిద్యాలయానికి సమ ర్పించి కృతార్థుడ నవుతాను" అని ముగించారు.

తర్వాత మరికొన్ని యేళ్ళకు ఆంధ్ర యూనివర్శిటీలో అక్కడి నిక్షేపాలలో ఆ గండపెండెరం వుండడం చూసి, శ్రీపాదవారి నిజాయితీకి సంతోషించాను.